క్లుప్తంగా

సీపీఎం నేత జ్యోతిబసుకు ఘన నివాళి



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భీమవరం: సీపీఎం నేత, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు 13వ వర్ధంతి స్థానిక సుందరయ్య భవనం వద్ద నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం జ్యోతిబసు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతిబసు 25 సంవత్సరాల పాటు బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జక్కంశెట్టి సత్యనారాయణ, త్రిమూర్తులు, కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉరకలేస్తున్న యువత



మొగల్తూరులో తలపడుతున్న వాలీబాల్ క్రీడాకారులు

మొగల్తూరు: రాష్ట్రంలోని యువత ఉత్సాహంగా ఉరకలేయాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గ్రామాల్లో జాతరలను సైతం లెక్కచేయకుండా యువత 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగస్వాములవుతున్నారు. బుధవారం మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం, పగన్నాథపురం, కాళీపట్నం, మొగల్తూరు 3, మొగల్తూరు 4 జట్ల మధ్య వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు పీడీ సుజాత తెలిపారు.

ముగ్గుల పోటీలు



పోటీల్లో పాల్గొన్న మహిళలు

నరసాపురం: సంక్రాంతి పురస్కరించుకుని పట్టణంలోని 13వ వార్డులో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ నాయకుడు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఎన్నో ఏళ్లుగా ఆటల పోటీలు నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో టి.అనిల్‌బాబు, కె.మనశ్విని, అద్దాల మురళి పాల్గొన్నారు.

బాడవలో పుంతలో ముసలమ్మ ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి: బాడవ పంచాయతీ రాయివారి దిబ్బలో ఉన్న పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. సంక్రాంతి రోజున జాతర జరిగింది. అప్పటి నుంచి మూడు రోజుల పాటు అమ్మవారి తీర్థ ఉత్సవాలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సంక్రాంతి పండుగకు పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు, బంధువులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఆఖరి రోజు సందర్భంగా బుధవారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ధనుర్మాసం ముగింపు



రథం ముగ్గు

పెనుగొండ: ధనుర్మాసంను ఇళ్ల ముందు రథం ముగ్గులతో ఘనంగా సాగనంపారు. నెలరోజుల పాటు రంగురంగుల ముగ్గులతో ధనుర్మాసం కళకళలాడింది. పండుగ నెల శుక్ర వారం ముగియడంతో బుధవారం ఉదయం ఇళ్ల ముందు రథం ముగ్గులనువేసి వాటిని వీధి చివరివరకూ ముగ్గుతో సాగనంపుతున్నట్లు వేశారు. కొత్త అల్లుళ్లను సైతం రథం ముగ్గులు వేసి సాగనంపుతారన్న నానుడీ సైతం ఉంది. ముక్కనుమ రోజు వేయడం అనవాయితీగా వస్తోంది. దీంతో గ్రామాల్లో అన్ని ఇళ్ల వద్ద రథం ముగ్గులే దర్శనం ఇచ్చాయి.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



కోళ్లపర్రు వద్ద పాత వయ్యేరులో గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



చెరుకువాడలో అడుగంటిన ఉండి ప్రధాన పంట కాలువ

ఆకివీడు: నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే రైతులకు, గ్రామాల్లోని మంచినీటి చెరువులకు నీటి ఎద్దడి తలెత్తుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కోళ్ళపర్రు వద్ద పాత వయ్యేరు పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ రెండు నెలలుగా నీటి పారుదల శాఖ ఈఈ, డీఈ, ఏఈలతో వెంకయ్య వయ్యేరు, పాత వయ్యేరు పంట కాలువల్లోని గుర్రపు డెక్క తొలగించాలని సూచించినా తీవ్ర నిర్లక్ష్యంతో వారు వ్యవహరిస్తున్నారని అన్నారు. పాత వయ్యేరు పంట కాలువలో తూడు తొలగింపునకు రూ.15 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్లు ఆమోదించినా కాంట్రాక్టర్ పనులు చేయకుండా బిల్లులు కాజేసేందుకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి గుర్రపుడెక్క సమస్యతో పాటు సాగు, తాగు నీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందించకపోవడంతో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), సిద్ధాపురం ఉప సర్పంచ్ నారాయణరాజు ఆర్థిక సహకారంతో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టినట్లు నర్సింహరాజు వివరించారు. వెంకయ్య వయ్యేరు పంట కాలువలోకి కలుషిత నీటి విడుదలను అడ్డుకోవాలని కోరారు. కాలువ వెంబడి 20 గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దువ్వ లాకుల షట్టర్ మరమ్మతుల పేరుతో పంట కాలువలోకి నీటి విడుదలను నిలుపుదల చేయడంతో దాళ్వా సాగు పనులకు ఆటంకం ఏర్పడిందని అన్నారు. కలెక్టర్, నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ తక్షణం స్పందించి ఈఈ, డీఈ, ఏఈలను సస్పెండ్ చేయాలని, సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని నర్సింహరాజు డిమాండ్ చేశారు. చర్యలు చేపట్టకపోతే సమస్యను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, ఇందుకూరి నారాయణరాజు, గాంధీరాజు, బుజ్జిరాజు, సర్పంచ్‌లు నల్లపరాజు రామరాజు, చిగురుపాటి జయశీలుడు (చిట్టిబాబు), మండల పరిషత ఉపాధ్యక్షుడు కిల్లి రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు షద్రక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాశిం నర్సింహారావు, కతారి కేశవరావు, గురువెల్లి రఘుప్రసాద్, దింటకుర్తి వెంకన్న, కేశిరెడ్డి వాసు, దాట్ల జగ్గరాజు, రైతు నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు, కలిదిండి సుదీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో సాగునీటికి ఇక్కట్లు

ఉండి: అధికారుల నిర్లక్ష్యంతో 800 ఎకరాల వ్యవసాయం ఇక్కట్ల పాలవుతోందని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు (శివయ్య) ఆరోపించారు. ఉండి కాలువ శివారు ప్రాంతం అయిన చెరుకువాడకు కొద్దిరోజులుగా సాగు నీరందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు సుమారు 400 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని మిగిలిన 400 ఎకరాల్లో నాట్లు వేయాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. ఈ సమయంలో సాంకేతిక కారణాల సాకు చూపించి సాగు నీటిని నిలుపుదల చేయడం దారుణమని ఆయన అన్నారు. ఏటా సాగునీటి కోసం అధికారులు ఇదే విధంగా చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు వరి నాట్లు వేసిన పొలాలు, నాట్లు వేయాల్సిన పొలాల్లో నారుమడులు ఎండిపోయే స్థితికి వచ్చాయని అన్నారు. అధికారులను అడుగుతుంటే సాంకేతిక కారణాల వల్ల సాగునీరు నిలుపుదల చేశామని చెప్పడం బాధాకరమన్నారు. నారుమళ్లు, నాట్లు వేసిన వరి చేలు ఎండిపోయే స్థితికి వచ్చినప్పుడు ఇటువంటి సాకులు చూపించి సాగునీరు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనని సర్పంచ్ మండిపడ్డారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించి వరిచేలకు అవసరమైన సాగునీటిని వెంటనే అందించాలని కోరుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

భీమవరం: రాజ్యాంగ సంక్రమించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని భీమవరం పోస్టల్ డిప్యూటీ సూపరింటెండెంట్ సురేష్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కు, స్వచ్ఛంద వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ పోస్టల్ ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. హెడ్ పోస్ట్ మాస్టర్ రామానుజాచార్యులు మాట్లాడుతూ నిష్పక్షపతంగా ఓటేసినప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆదర్శమని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, పోస్టల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగన్ పరిపాలన

దేశ చరిత్రలో జనవరి 19కి గొప్ప ఖ్యాతి



పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆకివీడు: దేశ చరిత్రలోనే కాదు, ప్రపంచ చరిత్రలో జనవరి 19వ తేదీ సువర్ణాక్షరాలతో లిఖితమై గొప్ప ఖ్యాతి పొందుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 206 అడుగుల ఎత్తులో నిర్మించిన బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. బీఆర్ అంబేడ్కర్ ఆశయాల్ని అమలు జేయడమే కాకుండా, ఆయన్ని నిత్యం స్మరించుకునే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భారీ విగ్రహాన్ని మన మధ్య ఏర్పాటు చేయడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. దేశ ప్రజల భవిష్యత్ కోసం, అట్టడుగు, అణగారిన జాతి ప్రజలకు సమానత్వం, ఆర్థిక స్థితిగతుల్ని మెరుగుపరచే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ అందరి వాడని సీఎం జగన్ నిరూపించారని నర్సింహరాజు చెప్పారు. అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగన్ పరిపాలన కొనసాగుతోందన్నారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో పేదల ఆర్థిక స్థితిని మెరుగు పర్చి, వారిని లక్షాధికారుల్ని చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. నవరత్నాలతో ప్రజల బతుకులు మారాయన్నారు. ప్రజల ఆరోగ్యం మెరుగు పడిందన్నారు. అంబేడ్కర్ కన్న కలలు రాష్ట్రంలో నిజమవుతున్నాయని చెప్పారు. విజయవాడలో ఈ నెల 19న అంబేడ్కర్ స్మృతి వనంలో ఆవిష్కరించనున్న విగ్రహావిష్కరణ సభకు నియోజకవర్గం నుంచి జనం తరలి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ప్రతి సచివాలయ పరిధి నుంచి జనం వెళ్లే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నర్సింహరాజు వెల్లడించారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీవీఎల్ పిలుపునిచ్చారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రికెట్ పోటీ విజేత అగ్రహారం జట్టు



ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో మండల విజేతగా నిలిచిన ఎన్నార్పీ అగ్రహారం క్రికెట్ జట్టు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసే కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మండల వ్యాప్తంగా ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం ఉండి జెడ్పీ హైస్కూల్ వద్ద నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఎన్నార్పీ అగ్రహారం జట్టు విజేతగా నిలిచింది. ఉండి–2, ఎన్నార్పీ అగ్రహారం జట్ల మధ్య నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఎన్నార్పీ అగ్రహారం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. 86 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఉండి–2 జట్టు 5 వికెట్లు కోల్పోయి 62 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఎన్నార్పీ అగ్రహారం జట్టు 23 పరుగుల తేడాతో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో క్రికెట్ పోటీ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా అగ్రహారం జట్టుకు బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు సూరవరపు వెంకటాచార్యులు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధించడమే లక్ష్యం



నివాళులర్పిస్తున్న నాయకులు

పోడూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిన్నూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్పరాజు అన్నారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిన్నూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేసి పూలమాలంకరణ చేశారు. ఈ సందర్భంగా సూర్పరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, సొసైటీ డైరెక్టర్ గోగులమండ విజయాదేవి, వార్డు మెంబరు నిర్మలాకుమారి, గుర్రపు రత్నకుమార్, వడ్లపాటి శ్రీలక్ష్మి, నల్లి రాజేష్, నల్లి విజయకుమార్, గోగులమండ ధనరాజు, వడ్లపాటి ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు వి.రాంబాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పోడూరు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని 'మన కోసం మనం' స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పడాల పెద్దిరాజు అన్నారు. జిన్నూరు గ్రామంలో సంస్థ ఆధ్వర్యాన సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, కబడ్డీ, స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. యువత, మహిళలు, బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. జిన్నూరు నర్సరాజునగర్‌లో బుధవారం ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రపంచంలోనే తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో భిన్నమైనవి, విశిష్టమైనవి అన్నారు. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు కనకారావు, పడాల కృష్ణవేణి, ఉదయ్, దాసరి సత్యనారాయణ, దాసరి సూర్యనారాయణ, కె.లక్ష్మి, కె.నాగేశ్వరరావు, గలవిల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమావేశంలో వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: కోపల్లె జెడ్పీ హైస్కూల్లో 1984లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా బాల్యమిత్రుల యోగ క్షేమాలు తెలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. వివిధ వృత్తుల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతిని పరిస్కరించుకుని ఒక చోట కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులలో తోటి విద్యార్థులైన సరాబు చిరంజీవి, పాతపాటి శ్రీనివాసరాజు, చొడాబత్తు నరసింహమూర్తి, పిల్లాలు డాక్టర్ సునీల్, డాక్టర్ స్నేహ, డాక్టర్ విశ్వజ వైద్య విద్య పూర్తి చేసిన సందర్భంగా వారిని పూర్వ విద్యార్థులంతా ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కే. గోపి, జి వేణు, సీహెచ్ మూర్తి, పి శ్రీహరిరాజు, సీహెచ్ ముఖేష్, వి సూరిబాబు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



వేములదీవిలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న తిరుమాని నాగరాజు

నరసాపురం రూరల్: పండుగ సమయాల్లో యువత కోడి పందేలు, జూదాల వైపు వెళ్లకుండా క్రీడలపై మక్కువ పెంచుకునేలా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అగ్నికుల క్షత్రియ రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు అన్నారు. మండలంలోని వేములదీవి గ్రామం గొందిమూలలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల సంయుక్త ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలలను ఆయన ప్రారంభించారు. అనంతర చెడుగుడు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డి.అనిల్‌బాబు, బొక్కా దుర్గరాజు, పుడింది దుర్గాప్రసాద్, కోడి తరుణ్, బొక్కా యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



బహుమతి గెలుచుకున్న విష్ణు విద్యార్థులు

భీమవరం: జాతీయ స్థాయి హైడ్రోజన్ బాహా పోటీల్లో విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు రూ.1,10,000 బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ మంగం వేణు తెలిపారు. ఎస్ఏఈ ఆధ్వర్యంలో ఇండోర్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో దేశంలోని పలు కళాశాలలు పాల్గొన్నాయన్నారు. విష్ణు విద్యార్థులు తయారు చేసిన హైడ్రోజన్ వాహనం ఐదు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. హైడ్రోజన్‌తో నడిచే వాహనాలకు రానున్న రోజుల్లో చాలా ప్రజాదరణ ఉంటుందని వివరించారు. విజేతలను విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ కె.ఆదిత్య డైరెక్టర్ దశిక సూర్యనారాయణ, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

ఘనంగా నాగారమ్మ జాతర ఉత్సవం

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ నాగారమ్మ అమ్మవారి జాతర ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. బుట్టబొమ్మలు, ఆసాదుల నృత్యాలు, బాణసంచా కాల్పులతో వైభవంగా జాతర ఉత్సవాన్ని నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. గురువారంతో అమ్మవారి జాతర ఉత్సవాలు ముగియనున్నాయి.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం



కందరవల్లిలో మాట్లాడుతున్న కబర్డీ

పెనుగొండ: దేశంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించేలా ప్రధాని మోదీ పాలన సాగిస్తున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్, బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్డీ అన్నారు. బుధవారం కందరవల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, ఎంపీటీసీ ఎర్రగొప్పుల నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు దమ్మా రాంబాబు, మండల యువ మోర్చా అధ్యక్షుడు బోడపాటి నాగ మహేష్‌రావు, మండల అధికారులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ తెలిపారు. బుధవారం పెనుమంట్ర మండలం భట్లమగుటూరు, వెలగలవారిపాలెం సచివాలయాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు భయ్యే సుగుణమ్మ, వెలగల సుగుణ అధ్యక్షతన కార్యక్రమాలు జరిగాయి. వెలగలవారిపాలెంలో పాల్గొన్న తాతాజీ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలలో అవగాహన లేక కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోలేపోతున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మాంద్రు శాంత వెంకటేష్, ఎంపీడీవో పద్మజ, బీజేపీ నర్సాపురం పార్లమెంటరీ కన్వీనర్ పీవీ రావు, ఆచంట అసెంబ్లీ కన్వీనర్ కర్రి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు కేహెచ్‌వీ ప్రసాద్‌రెడ్డి, కొవ్వూరి రామకృష్ణారెడ్డి, యువ మోర్చా అధ్యక్షుడు కర్రి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

కొనసాగిన కోడి పందేలు



సీసలి బరిలో పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు/ఉండి/కాళ్ల : కోడి పందేలు నాల్గవ రోజు బుధవారం కొనసాగాయి. ఆయా ప్రాంతాల్లో కోడి పందేల నిర్వాహకులు టెంట్లు తొలగించి, ఆయా బరులను ఖాళీ చేస్తుండగా బుధవారం వరకూ కోడి పందేలు కొనసాగించవచ్చని నిర్వాహకులు చెప్పడంతో జూదరులు పందేనికి సై అన్నారు. ఉండి, మహదేవపట్నం తదిదర ప్రాంతాల్లో కోడిపందేలు నిర్వహించారు. పందేలను తిలకించేందుకు జనం అంతంత మాత్రంగానే హాజరయ్యారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలో కోడి పందేలు కొనసాగించారు.

వైభవంగా పైడమ్మ జాతర



చిలుకూరు పైడమ్మ జాతరలో పాల్గొన్న సినీ దర్శక నిర్మాత రాజా వన్నెంరెడ్డి, భక్తులు

ఉండి: మండలంలోని చిలుకూరులో పైడమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నిర్వహించిన ఈ జాతర ఊరేగింపులో సినీ దర్శక నిర్మాత రాజా వన్నెంరెడ్డి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విచిత్ర వేషధారణలు, తీన్‌మార్ డప్పులు, గరగ నృత్యాలు, బాణ సంచా కాల్పులతో గ్రామంలోని ప్రధాన రహదారిలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో గంగాలమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యాన పులిహోర వితరణ చేశారు. అనంతరం నరసాపురం పట్టణానికి చెందిన బాలస్వామి బృందంతో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి మొగల్తూరు హరే శ్రీనివాసా కోలాటం సమాజంతో కోలాట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గంగానమ్మ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గురువారం అన్నసమారాధనను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు సీనియర్ సిటిజన్లకు అవగాహన సదస్సు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ సీనియర్ సిటిజన్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఈనెల 19వ తేదీ శుక్రవారం సీనియర్ సిటిజన్స్ హక్కులు, వారికి సంబంధించిన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు వంగా నరసింహరావు తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఫిష్ మార్కెట్ నందు గల పెన్షనర్స్ భవనం నందు ఈ సదస్సు జరుగుతుందన్నారు. అలాగే 21వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక శంభునిపేటలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో లయన్స్ కంటి వైద్యశాల ఆధ్వర్యాన నేత్ర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపావు. శిబిరంలో అర్హులైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘ సెక్రటరీ ముత్యాల రామారావు, కేవీఎల్ నరసింహరాజు, యర్రంశెట్టి వెంకటరత్నం పాల్గొన్నారు.